దోషాలు పోతాయి. నీ బుద్ధిలో ఉన్న దోషాలు పోయినప్పుడు లోపల ఉన్న పరమాత్మ నీకు వ్యక్తమవుతాడు. మనకు చాలా డబ్బు ఉంది, పాండిత్యం ఉంది, పెద్ద పదవి ఉంది, అన్నీ ఉన్నాయి, అయినా మీకు దుఃఖం వస్తోంది అనుకోండి, వాటిని ఏమి చేసుకొంటారు, మీకు దుఃఖం వస్తూ ఉంటే అది జ్ఞానం ఎలా అవుతుంది. కర్తృత్వబుద్ధి నశించే వరకు మిమ్మల్ని దుఃఖం వెంటాడుతుంది. నీకు శాశ్వతంగా దుఃఖం రాకూడదు, అది పరమస్థితి. సాధన చేయగా చేయగా ఏదో రోజు కలిసి వస్తుంది. ఎదురు చూసినట్లు ఉండకూడదు. మీరు మంచి చేసారు అనుకోండి, ఆ ఫలితం మీకే ఇచ్చేస్తాడు ఎందుచేత నంటే ఆయనకు ఏమీ అక్కరలేదు, కర్మఫలం కోరవద్దు అని భగవంతుడు చెప్పాడు కాని ఫలితం ఇవ్వనని ఆయన చెప్పలేదు. మన మాటలే, మన ఆలోచనలే మనలను బంధిస్తాయి. అనుకొనేవాడు జీవుడు, ఏమీ అనుకోనివాడు దేవుడు. అనుకొనేవాడు బంధింపబడతాడు. ఎట్టిపరిస్థితులలోను మీ శాంతిని పాడుచేసుకోవద్దు, శాంతచిత్తమును కాపాడుకోండి. పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా మీరు శాంతిగా ఉంటున్నారు అనుకోండి, అప్పుడు భగవంతుడు మీకు మోక్షాన్ని ప్రసాదిస్తాడు. ఎవరైనా పొగిడితే నీకు పొంగువస్తుంది అనుకో, ఎవరైనా విమర్శిస్తే నీవు కృంగిపోతావు అనుకో నీవు ఇంకా భక్తిమార్గానికి ఫిట్ అవ్వలేదు అంటున్నాడు పరమాత్మ. పొంగటం, కృంగటం ఇవి లోకమానవుడు చేసేపని నీవు భక్తుడవు అయిఉండి నీకు ఈగోల ఎందుకు? నిందను, స్తుతిని తట్టుకోలేకపోతే ప్రాపంచిక మానవుడికి నీకు తేడా ఏమిటి? అంటున్నాడు. మంచిపనులు చేసిన ఈ లోకంలోనికి వచ్చి వెళ్ళిపోయిన గుర్తు ఎవడైతే కోరడో వాడు నిజమైన మంచివాడు. ఈ ఘనత్వం, ఈ నీచత్వం మనోదేహములకు సంబంధించినవి. మనోదేహములను దాటితే ఘనత్వం లేదు, నీచత్వం లేదు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-10-05, కైకలూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈ ప్రవచనాలు అన్నీ జ్ఞానయజ్ఞాలు, సబ్జక్టు మీ అంతట మీరు చదువుకోవటం కంటే, ముందు శ్రవణం చేసి తరువాత చదువుకొంటే బాగా అర్థమవుతుంది, దాని తాలుక సుఖం మీకు తెలుస్తుంది. మీలో ఎవరికైనా కష్టాలు ఉన్నా, ఇబ్బందులు ఉన్నా, ఒకవేళ మీ దేహప్రారబ్ధం మీకు అనుకూలంగా లేకపోయినా వీటినన్నింటిని కూడా మనం భక్తి వలన అతిక్రమించవచ్చు. మనకు ఉన్న భక్తి నిజమైతే కుటుంబపరంగా కాని, సమాజపరంగా కాని ఎన్ని కష్టాలు వచ్చినా

ఆ కష్టాలను అతిక్రమించగలిగే శక్తి మనకు వస్తుంది. ఎక్కడయితే భక్తి ఉంటుందో అక్కడ సహనం ఉంటుంది, అక్కడ ప్రకాశం ఉంటుంది, అక్కడ జ్ఞానం ఉంటుంది, అక్కడే మోక్షం ఉంటుంది. జ్ఞానం, వైరాగ్యం భక్తి యొక్క పిల్లలు. మనకు క్రమ శిక్షణ ఉంటేకాని, ఈశ్వరుడిపట్ల సజీవమైన విశ్వాసం ఉంటేకాని ఆ భక్తి మనకు ఉదయించదు. పూర్వజన్మసుకృతం, సజ్జనసాంగత్యం మనకు ఇవిఅన్నీ కలిసిరావాలి, ముముక్షత్వం ఉండాలి, జిజ్ఞాస ఉండాలి, ఇన్ని కలిసివస్తేగాని ఆ భక్తి నిలబడదు. ఇది అంతా భగవంతుడి యొక్క లీల, ఇది నిజం కాదు కాని ఇది మనకు నిజంలాగ కనిపిస్తోంది. మనకు భక్తి, జ్ఞానం, వైరాగ్యం, వివేకం లేకపోవటం వలన నిజం కానిది నిజంలాగ మనకు కనిపిస్తోంది. ఒకసారి రామకృష్ణ పరమహంస మాటలు చెపుతూ ఉంటే ఒకరు ఆ మాటలు విని మీరు చెప్పే మాటలు చాలా నిస్సారంగా ఉన్నాయి అన్నాడు. దానికి పరమహంస ఉద్రేక పడలేదు. మీకు లోకానికి సంబంధించిన జ్వరం ఎక్కువగా ఉంది అందుచేత ఈ మాటలు రుచించటం లేదు అన్నారు. రజోగుణం, తమోగుణం ఉన్నవారికి పరమహంస మాటలు ఎలా నచ్చుతాయి.

ఈశ్వరుని లీలలు మనకు అర్థం కావు. ఎవరికైనా కష్టాలు వచ్చినా తొందరపడవద్దు. ఆ కష్టం భవిష్యత్‌లో సుఖాన్ని తీసుకొని రావచ్చు లేకపోతే ఆ కష్టం మన మనస్సును మోక్షం వైపుకు తిప్పటానికి రావచ్చు అందుచేత మనం తొందరపడకూడదు. కర్త భగవంతుడే. భగవంతుడు కర్త మాత్రమే కాదు, కర్మ కూడా ఆయనే. మన చేతిలో ఏమీ లేదు. మనకు దేహాభిమానం ఉండటం వలన, మన మనస్సుకు లోపలకు వెళ్ళే శక్తి లేకపోవటం వలన ఇది అంతా నేనే సాధిస్తున్నాను అని అనుకొంటాము. మనకు రాబోయే జన్మ గురించి తెలియదు, గత జన్మ తెలియదు. మనం ఈ లోకంలోనికి వచ్చాము, కాలాన్ని సద్వినియోగం చేసుకోవటం కూడా మనకు తెలియటం లేదు. మనకు మరణం వచ్చింది అనుకోండి కొద్ది టైము ఆగు, నేను సాధన చేసుకొంటాను అంటే ఆగదు. కాలాన్ని కనుక మనం సద్వినియోగం చేసుకోకపోతే అది మనలను మింగేస్తుంది. ఎవడైతే కాలాన్ని సద్వినియోగం చేసుకొంటాడో వాడికి జ్ఞానం కలుగుతుంది. ఒక్క కాలమే కాదు మనకు చదువు ఉంటే చదువును, డబ్బు ఉంటే డబ్బును, తెలివి ఉంటే తెలివిని కూడా సద్వినియోగం చేసుకోవాలి. భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను సద్వినియోగం చేసుకొంటనే మన మనస్సుకు అంతర్‌దృష్టి కలుగుతుంది కాని లేకపోతే అంతర్‌దృష్టి రాదు.

మరణం అంటే అందరికీ భయం ఉంటుంది. మరణం అంటే ఏమీ లేదు పాత శరీరం పోతుంది, కొత్త శరీరం వస్తుంది అంతే. ఈ శరీరానికి మరణం రాకముందే ఎవడైతే బ్రహ్మానుభవాన్ని పొందాడో వాడు మాత్రమే కాలాన్ని సద్వినియోగం చేసుకొన్నట్లుగా మనం గుర్తు పెట్టుకోవాలి. యుద్ధం తరువాత కృష్ణుడు పాండవులను భీష్ముడి దగ్గరకు తీసుకొని వెళతాడు. వీరందరిని చూసేటప్పటికి భీష్ముడికి కన్నీళ్ళు వస్తాయి. ఇంతటి మహాత్ముడికి కన్నీరు రావటం ఏమిటి? చావు అంటే భయం వేస్తోందా తాతగారికి? అని ధర్మరాజు కృష్ణుడిని అడుగుతాడు. తాతగారికి కన్నీరు వస్తోంది అని నన్ను అడిగితే నేను ఏమి చెపుతాను, తాతగారినే అడుగు అంటాడు కృష్ణుడు. భీష్ముడికి కన్నీళ్ళు ఎందుకు వస్తున్నాయో తెలియని వాడుకాదు పరమాత్మ, భీష్ముడు చెపితే విందామని. అప్పుడు ధర్మరాజు భీష్ముడిని కన్నీళ్ళు ఎందుకు వస్తున్నాయని అడుగుతాడు. ధర్మజా! మీరు జీవితంలో చాలా కష్టాలు పడ్డారు, బాధలు అనుభవించారు. మామూలుగా కష్టాలు పడటం వేరు, సాక్షాత్తు పరమాత్మ కూడా ఉండి కూడా కష్టాలు పడుతున్నారు, ఇది కదా భగవంతుడి యొక్క లీల, భగవంతుడి యొక్క మాయ ఇట్టిది కదా అని జ్ఞాపకం వచ్చి కన్నీళ్ళు వస్తున్నాయి అంతేగాని చావు గురించి భయం వలన కాదు అని భీష్ముడు చెప్పాడు. భగవంతుడి యొక్క శక్తి, భగవంతుడి యొక్క లీలలు మనం అర్థం చేసుకోవాలి అని చెప్పటంకోసం భీష్ముడు చేత చెప్పించాడు. ఈ లోకాన్ని ఎలా ఆడించాలో అంతా పరమేశ్వరుడు చూసుకొంటాడు. మనం ఈ లోకంలోనికి వచ్చాము, ఆయన పాదాల మీద భక్తిని నిలబెట్టుకొంటూ జ్ఞానం సంపాదించుకొని బయటకు వెళ్ళిపోవాలి. ఇది అంతా ఆయన లీల, ఇది మనకు అర్థంకాదు. అందుచేత మన పని ఏదో మనం చూసుకొని ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోవటం మంచిది అని భీష్ముడు చేత పరమాత్మ చెప్పించాడు.

మీరు అందరూ సంసారంలో ఉన్నారు జ్ఞానం వస్తుందా? రాదా? అని కంగారు పడకండి. ఒక చేతితో మీ ఇంటి దగ్గర పని చూసుకోండి, ఒక చేతితో భగవంతుని పాదాలను పట్టుకోండి. మీరు చేసే పని పూర్తి అయిపోయింది అనుకోండి, విశ్రాంతి జీవితం వచ్చింది అనుకోండి అప్పుడు రెండు చేతులతో భగవంతుడి పాదాలను పట్టుకోండి అని రామకృష్ణుడు చెప్పారు. మన పొట్టకు అన్నం కావాలి. అన్నం కావాలి అంటే డబ్బు ఉండాలి, కట్టుకోవటానికి బట్టలు ఉండాలి దానికి డబ్బు కావాలి, ఉండటానికి ఇల్లు కావాలి దానికి డబ్బు కావాలి,

ఏదైనా రోగం వస్తే మందులు వేసుకోవాలి దానికి డబ్బు కావాలి. ఇది తప్పించి నీకు డబ్బుతో పని ఏమిటి? అన్నాడు రామకృష్ణుడు. వీటికి తప్పించి నీ దగ్గర పదివేల కోట్లు ఉన్నా నీకు ప్రయోజనం ఏముంది? అది ఎవరో ఒకరు తింటారు. నీకు సంబంధించినంత వరకు నీవు తరిస్తున్నావో లేదో చేసుకో. తామరాకును నీరు అంటదు అలాగే భక్తుడిని కర్మ అంటదు. భక్తుడు భగవంతుడి చేతిలో కేవలం పనిముట్టుగానే ఉంటాడు. బ్రహ్మం మన హృదయంలోనే ఉంది. అది రూపరహితం, నామరహితం, క్రియారహితం. దానితో నీకు అనుబంధం ఏర్పడితే మంచిదే లేకపోతే బాహ్యంగా ఉన్న సత్పురుషులతో సహవాసం చెయ్యి. సజ్జన సాంగత్యం దొరకటం కూడా చాలా కష్టం. మనంతట మనం సాధన చేసి చెడుతలంపులలో నుండి బయటకు రాలేకపోతున్నాము అనుకోండి, సజ్జనసాంగత్యం వలన వాటిలో నుండి బయట పడవచ్చు, వారు మనకు సహాయ సహకారములు అందిస్తారు.

ఏది ఎప్పుడు జరగాలో అది జరిగిపోతూ ఉంటుంది. మీకు ఒకవేళ రోజులు వైభవంగా వెళ్ళిపోతున్నా అదీ స్వప్నమే, ఇబ్బందులతో రోజులు గడుస్తున్నా అదీ స్వప్నమే అయితే ఇది మంచికల అనుకోవచ్చు, దానిని చెడ్డకల అనుకోవచ్చు. ఈ ప్రపంచం అంతా స్వప్నం అంటున్నారు ఏమిటి అని మీరు అడగవచ్చు, మీ హృదయంలో ఉన్న సద్వస్తువు మీకు వ్యక్తమైనప్పుడు కాని ఇది స్వప్నం అన్న సంగతి మీకు అనుభవంలోనికి రాదు. మంచివారు ఏ పని చేసినా మౌనంగానే చేస్తారు, వారికి ఆడంబరం అక్కరలేదు, గుర్తింపులు అక్కరలేదు. ఎందుచేత నంటే అజ్ఞానికి ఇతరులు ఉన్నారు కాని జ్ఞానికి ఇతరులు లేరు. నీకు ఎన్ని కంఫర్ట్సు ఉన్నా నిద్ర పట్టకపోతే ప్రయోజనం లేదు అలాగే నీకు ఎన్ని ఉన్నా శాంతి లేకపోతే ప్రయోజనం లేదు. శాంతి యొక్క వైభవం ఎటువంటిది అంటే నేను శాంతిగా ఉన్నాను అనుకోండి మీరందరు నాకు స్నేహితులు అయినా కాకపోయినా స్నేహితులుగా కనబడతారు, నేను అశాంతిగా ఉన్నాను అనుకోండి మీరందరు నాకు విరోధులుగా కనబడతారు. మనం సాధన చేసి అశాంతిలో నుండి ఎంతవరకు విడుదల పొందుతున్నాము అనేది చూసుకొంటూ ఉండాలి. మీరు ఇలా రండి బోధిస్తాను అని పది మందిని పోగుచేసుకొని గురువై పోదామని చూస్తారు. కొబ్బరిచెట్టు ఎక్కకుండానే కొబ్బరికాయలు తీసేసుకొంటాను అనటం ఎటువంటిదో, ఏమీ సాధనలు లేకుండానే నేను బోధిస్తాను అనటం అటువంటిదే. నువ్వు సాధన చేసి అధికారం సంపాదించి నాలుగు మాటలు చెపితే ఎవరైనా వింటారు, అధికారం

లేకుండా చెపితే ఎవరూ పట్టించుకోరు.

మనం పుణ్యం చేసినా, పాపం చేసినా శరీరం, వాక్కు, మనస్సు ఈ మూడే పరికరాలు. అందుచేత ఈ మూడింటిని బాగా సద్వినియోగం చేసుకోవాలి. నియమింపబడినటువంటి వాక్కు ఉండాలి, స్వాధీనం అయిన శరీరం ఉండాలి, నిగ్రహింపబడినటువంటి మనస్సు ఉండాలి, ఇవన్నీ ఆత్మజ్ఞానసముపార్జనకు సహకరిస్తాయి. లౌకికులతో స్నేహం చేయటం తేలిక, విడిపించుకోవటం కష్టం. అందుచేత లౌకికులతో స్నేహం చేయకండి, జాగ్రత్తగా ఉండండి అని రామకృష్ణుడు చెప్పారు. మన మాటలు సక్రమంగా లేకపోతే, ఎప్పుడు ఎలా మాట్లాడాలో అలా మాట్లాడకపోతే మన మాటలే మనల్ని బలికోరతాయి. ఇతరులు ఎటువంటి వారు అని మనకు అనవసరం, వారితో అనుబంధం మాత్రం శాంతిగా ఉండాలికాని అశాంతిగా ఉండకూడదు. మనం ఇతరుల విషయాలలో కలుగజేసుకోకుండా, మన చేతిలో ఉన్న పనిని సక్రమంగా చేసుకొంటూ, బేధదృష్టి తగ్గించుకొంటూ, జపతపములతో కాలక్షేపం చేస్తూ, సజ్జనసాంగత్యం చేస్తూ, ఈశ్వరుని పట్ల సజీవమైన విశ్వాసం కలిగిఉంటే ఎప్పుడో కాదు ఇప్పుడే ఇక్కడే ఈ శరీరానికి మరణం రాకముందే మనం మోక్షసుఖాన్ని పొందవచ్చు. అయితే అంతర్యామి దయ లేకుండా ఆ మోక్షసుఖం మనకు రాదు. ఒక్క ఆత్మలో తప్పించి సుఖం ఎక్కడా లేదు. ఆత్మసుఖం మీకు అనుభవంలోనికి వచ్చిందా మీ దుఃఖం అంతా ఆనందంగా మారిపోతుంది. లోకంలో ఏదో ఉంది అని అనుకోవటం వలన మన మనస్సు బాహ్యముఖానికి ప్రయాణం చేస్తోంది. లోకంలో ఏమీ లేదు, నీ కోరిక అలా అనిపింప చేస్తోంది, అంతా మనస్సే. నేను జిన్నూరులో ఉన్నట్లు కైకలూరులో ఉండలేకపోతున్నాను అనుకోండి నా మనస్సులో ఏదో దోషం ఉన్నట్లు గుర్తు. మనస్సును విడిచిపెట్టి మాయలేదు, మనస్సును విడిచిపెట్టి అజ్ఞానంలేదు. మాయ అంతా మనస్సులోనే ఉంది. ఆ మనస్సు అణిగిపోతే మాయ కూడా అణిగిపోతుంది.

పుల్లటికాయలు కాచే చెట్లు, తియ్యటి కాయలు కాచే చెట్లు, చేదుకాయలు కాచే చెట్లు ఉంటాయి. అలాగే మనుషులలో కూడా కొంతమంది తియ్యగా ఉంటారు, కొంతమంది పుల్లగా ఉంటారు, కొంతమంది చేదుగా ఉంటారు. ఈ అందరి మధ్యలో ఎవరిమీద బేధ దృష్టి పెట్టుకోకుండా, ఎవరి మీద ఉద్రేకం పడకుండా ఇది అంతా ప్రకృతి సహజం అనుకొంటూ సమన్వయం చేసుకొంటూ, మన పని ఏదో మనం శ్రద్ధగా చేసుకొంటూ జ్ఞానం సంపాదించు

కొని ఈ లోకంలోనుండి బయటకు పోవాలి, అప్పుడు నీకు సొమ్ము, అలా చేయకపోతే నీ నోటినిండా దుమ్ము. రాముడు దేవుడు అనుకొంటున్నాము. ఆయన రామేశ్వరంలో నుండి లంకలోనికి వెళ్ళటానికి సారథి కట్టవలసి వచ్చింది. ఆంజనేయస్వామి రామ, రామ, రామ అనుకొంటూ సముద్రాన్ని లంఘించి ఆప్రక్కకు వెళ్ళిపోయాడు. అంటే రాముడు కంటే రామ నామం గొప్పదని మీకు తెలియటం లేదా అన్నాడు రామకృష్ణుడు. నామం యొక్క ప్రభావం ఎలా ఉంటుందో మీకు తెలియటం లేదు ఎందుచేతనంటే మీకు విశ్వాసం లేదు. మనం లోపల ఏదో కోరిక పెట్టుకొని భగవంతుడిని ప్రార్థిస్తాము. ఒకవేళ ఆ కోరిక నెరవేరవచ్చు కాని దాని వలన ప్రయోజనం లేదు. మనం ఎవరికోసమైతే ప్రార్థించి వారి కోరిక నెరవేరేలా చూసామో చివరకు వారే మనకు శత్రువులు అవుతారు, జరిగేది అది. అందుచేత ప్రకృతి గొడవలు విడిచిపెట్టు. నీకు ఏదైనా కోరిక వస్తే ఆ కోరిక నెరవేర్చమని భగవంతుడిని ప్రార్థించటం మొదలుపెట్టవద్దు. నీకు ఏది మంచిదో ఈశ్వరుడి కంటే నీకు ఎక్కువ తెలుసునా? నీకు తెలియదు, మరి ఇంక ఆ కోరికలు ఎందుకు? నువ్వు ఏమైనా సర్వజ్ఞుడివా? ఈ గోడ ప్రక్కన ఏముందో నీకు తెలియదు. స్వామివారు గోవర్ధనపర్వతాన్ని బొటనవేలితో ఎత్తిపట్టుకొని వారంరోజులు ఉంచారు. మనం చీపిరికట్టను పైకి లేవదీయలేము. నేను ఘనకార్యం చేస్తున్నాను అని ఆయన అనుకోలేదు, అలా అనుకొంటే ఆయన దేవుడు కాదు. ఆ పని చెయ్యాలని చేయలేదు ఇంద్రుడి యొక్క గర్వం అణచటానికి చేసాడు. మన ఋషులను, అవతారపురుషులను గురించి మీరు శ్రవణం చేయాలేగాని వారు అమృతాన్ని వర్షం కింద కురిపిస్తారు.

రాబందులు ఆకాశంలో చాలా పైన ఎగురుతాయి కాని వాటి దృష్టి అంతా క్రింద శవాల మీద ఉంటుంది, ఎక్కడ శవాలు కనిపిస్తే అక్కడ వాలి తిందామని చూస్తాయి. అలాగే కొంతమంది పండితులు వారికి పాండిత్యం ఉంటుంది కాని వారి దృష్టి లౌకికవిషయాల మీదే ఉంటుంది, లౌకికవిషయాలను అతిక్రమించలేరు అని రామకృష్ణుడు చెప్పారు. కొంత మంది సహజంగానే జ్ఞానులుగా పుడతారు, శుకమహర్షి, శంకరాచార్యుల వంటివారు. కొంత మంది రమణమహర్షి లాంటివారు సడన్‌గా జ్ఞానులైపోతారు, అరుణాచలం అరుణాచలం అన్నారు అంతే ఆయన పని పూర్తి అయిపోయింది. కొంతమంది సాధన చేసి సాధన చేసి ఇంద్రియాలను, మనస్సును అరగదీసి జ్ఞానం సంపాదిస్తారు, అందరూ జ్ఞానులే. మీ పూర్వ

జన్మ సంస్కారాన్ని బట్టి అటువంటి సత్పురుషుల, జ్ఞానుల సహవాసం దొరికితే మీ ప్రయత్నం తక్కువైనా మీలో ఉన్న వాసనలు, పునర్జన్మలను తీసుకొని వచ్చే సంస్కారాలు అన్నీ ఒకోటి, ఒకోటి సన్నగిల్లిరాలిపోతాయి, సజ్జన సాంగత్యం యొక్క గొప్పతనం అట్టిది. మీరు స్నేహితుల దగ్గరకు, బంధవులు దగ్గరకు వెళ్ళినప్పుడు జ్ఞానాన్ని శాంతిని తీసుకొని వెళ్ళాలి, కాని మీరు అశాంతిని, అజ్ఞానాన్ని తీసుకొని వెళతారు. అసలే వారు అజ్ఞానంతో, అశాంతితో కాలిపోతూ ఉంటే ఇంకా దానిని పెంచుతున్నారు. అందుచేత మీరు శాంతికి రాయబారులుగా ఉండాలి, జ్ఞానానికి రాయబారులుగా ఉండాలి. అందుచేత మనం చేస్తున్న పని ఏమిటి? మనం ఎలా మాట్లాడుతున్నాము? ఇతరులకు మన ద్వారా జరిగేది ఏమిటి అని చూసుకోవాలి. రావణాసురుడిని తక్కువవాడు అనుకోకండి, చాలా గొప్పవాడు, అనేక వరాలు పొందాడు, మహా ఐశ్వర్యవంతుడు. ఇన్ని వరాలు ఉండి, ఇంత ఐశ్వర్యం ఉండి ఎలా పాడై పోయాడు? ఇతరులు ఆయనను పాడుచేయలేదు, ఆయన చేసిన చెడ్డకర్మల వలననే ఆయన పాడైపోయాడు. ఎవరి జీవితం అయినా అంతే, ఆయన ఆరంభించిన హింసా విధానం వలన ఆయన పొందిన వరాలు కూడా ఆయనకు ఉపయోగం లేకుండా పోయింది, బూడిదలో పోసిన పన్నీరు అయిపోయింది.

ప్రపంచ విషయాల మీద మనకు ఏమైనా కోరికలు ఉన్నాయి అనుకోండి దానిని కామం అంటారు. భగవంతుడు కావాలి అని కోరుకొంటున్నాము అనుకోండి దానిని భక్తి అంటారు. ఇంతే ఇందులో ఏదో పెద్ద తేడా ఉందని బుర్రని గాబరా చేసేసుకోవద్దు. మన మొఖం ఇటు తిప్పే బదులు అటు తిప్పితే చాలు. మీరు కోరికను విడిచిపెట్టనక్కరలేదు. మీ కోరికను భక్తివైపుకు మరల్చండి, మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. మీ అమ్మాయి మీరు చెప్పినట్లుగా ప్రతీదీ వింటోంది అనుకోండి, మీకు ఉన్న ఆస్తి అంతా మీ అమ్మాయికి ఇచ్చేయాలనిపిస్తుంది, నీకు నా ఆస్తి ఏమీ ఇవ్వను అని మీరు అమ్మాయితో చెప్పినా మీ ఇష్టం అని అంటుంది. అలా ఎవడైతే భగవంతుడు చెప్పినట్లుగా ఉంటున్నాడో వాడికి ఆత్మ తన్నుతాను అర్పించుకొంటుంది, అది ఆత్మ యొక్క వైభవం. చైతన్యాన్ని తెలుసుకోవటానికి మనం ఎంతటివారము, మన తెలివి ఎంత? చైతన్యం మనకు తెలియబడితే తెలుసుకోవటానికి పనికివస్తాము కాని నాకు తెలియబడు అని అడగటానికి మనకు అర్హత లేదు. మీరు గురువుకు సేవ చేస్తే అది వృధా పోతుంది అని అనుకోవద్దు దాని వలన మీలో ఉన్న వాసనలు

నశిస్తాయి. మీకు జ్ఞానం కలుగుతుంది, అది గురువు యొక్క అనుగ్రహం. మనం భగవంతుడు చెప్పిన మాటను వింటే అది ధర్మం, నువ్వు చెప్పిన మాటను నేను వినను అని భగవంతుడిని తిరస్కరిస్తే అది అధర్మం. అరణ్యవాసంలో రామచంద్రమూర్తి లక్ష్మణుడితో నువ్వు ఆలోచించి ఎక్కడ బాగుంటే అక్కడ ఒక పర్ణశాల నిర్మించమని చెపుతాడు. మీరు పర్ణశాల ఎక్కడ నిర్మించమంటే అక్కడ నిర్మిస్తాను కాని నిర్ణయం నాకు ఇవ్వకండి అంటాడు లక్ష్మణుడు, అది శరణాగతి. కొంతమంది భక్తులు ఎలా ఉంటారు అంటే భగవంతుడు దర్శన మిచ్చి మీకు ఒక గంటలో మోక్షం ఇస్తాను అంటే వారికి ఏమీ అనిపించదు, నిర్వికారంగా ఉంటారు, ఇప్పుడు మీకు మోక్షం ఇవ్వను, లక్ష జన్మల తరువాత మోక్షం ఇస్తాను అంటే మీ ఇష్టం అంటారు, వారికి జ్ఞానం వచ్చేది.

మనకు మనస్సు ఉంది కాబట్టి తొంభై రకాలుగా అనుకొంటూ ఉంటాము. అనుకొనేది జీవసంకల్పం, జరిగేది ఈశ్వరసంకల్పం. అది అలా ఎందుకు జరిగింది, ఇది ఇలా ఎందుకు జరిగింది అని మనం అనుకొంటాము, అది ఈశ్వరుడికి తెలియకుండా జరగటం లేదు. చేసేది ఆయనే, అసలు ఉన్నది ఆయనే నువ్వు అంటూలేవు. నువ్వు ఉన్నాను అనుకొంటున్నావు అందుచేత దుఃఖం నిన్ను వెంటాడుతోంది. నీకు శరీరంతో ఎలా తాదాత్మ్యం ఉందో, మనస్సుతో ఎలా తాదాత్మ్యం ఉందో అలాగ నీ లోపల ఉన్న సత్యవస్తువుతో తాదాత్మ్యం పొందు, దానితో ఏకంగా ఉండు, హృదయంలో మునుగు, అప్పుడు అది నీకు ఎరుకలోనికి వస్తుంది. ఎవరైనా ఒక మనిషిని వాడు ఎట్టివాడు అంటే వాడు మంచివాడు, వాడు చెడ్డవాడు అంటే ఆ మాటకు అర్థం ఏమిటి? ఒకేసారి మంచివాడుగా, చెడ్డవాడుగా ఎలా ఉంటావు. ఉంటే మంచివాడుగా ఉండాలి, లేకపోతే చెడ్డవాడిగా ఉండాలి. ఉంటే నీకు సత్యబుద్ధి ఉండాలి లేకపోతే అసత్యబుద్ధి ఉండాలి. నీవు సత్యాన్ని గుర్తిస్తున్నావు అనుకో అసత్యం నిన్ను విడిచి పెట్టేస్తుంది. కుమ్మరి కుండలు చేస్తూ ఉంటాడు. ఒక కుండ ఎండిపోయింది, ఒక కుండ పచ్చిగా ఉంది. ఒక ఎద్దు వచ్చి ఆ రెండు కుండలను తొక్కేసింది అనుకోండి. అప్పుడు కుమ్మరి ఎండిపోయిన కుండను బయటపడేస్తాడు, పచ్చికుండను తీసుకొనివచ్చి మరల మట్టిలో కలిపేస్తాడు, ఎండిపోయిన కుండను మట్టిలో కలపటం కుదరదు కదా. అదేవిధంగా ఈ జీవితంలో తపస్సు చేసి, సాధన చేసి విషయవాసనలను ఎవడైతే ఎండబెట్టాడో వాడు సంసారానికి పనికిరాడు, వాడిని భగవంతుడు సంసారంలో నుండి విడదీస్తాడు, వీరు ముక్త

జీవులు అని వారిని వదిలేస్తాడు, వారికి ఉన్నదంతా స్వేచ్ఛ. ఇంకా ఎవరైతే పచ్చిగా ఉన్నారో వారిని తీసుకొని వచ్చి మరల సంసారంలో పడేస్తాడు అని రామకృష్ణుడు చెప్పారు. నీకు మనస్సు ఉన్నంతకాలం భయాలు వస్తూ ఉంటాయి, అసూయ, ఇష్టం, అయిష్టం, మోహం, దుఃఖం వస్తూ ఉంటుంది. ఎన్నో గొడవలు వస్తూ ఉంటాయి. ఎన్ని వచ్చినా మీరు గురువుతో కనుక కలిసి ఉంటే మీకు వచ్చిన భయాలు, ఆలోచనలు, దుఃఖం అన్నీ పోతాయి, అట్టివాడు గురువు, అది గురువు యొక్క వైభవం.

నీకు మోహం ఉంటే మంచివాడు చెడ్డవాడుగా, చెడ్డవాడు మంచివాడుగా, ఉన్న వస్తువు లేనట్లుగా, లేనిది ఉన్నట్లుగా కనిపిస్తుంది. మనం ఏమి మాట్లాడుతున్నాము, ఏ పని చేస్తున్నాము, ఎలా ప్రవర్తిస్తున్నాము దాని పరిణామం ఏమిటి అని మనం జాగ్రత్తగా చూసుకోవాలి. నువ్వు మందులు మింగుతూ ఉంటే దానివలన రోగం తగ్గుతోందో, లేదో చూసుకో. అలాగే నువ్వు సాధన చేస్తే సరిపోదు దానివలన మారుమనస్సు వస్తోందో లేదో చూసుకోవాలి. ఒక మహాత్ముడు సన్నిధిలో నీవు జీవిస్తూ ఉంటే నీ సాధనతో నిమిత్తం లేకుండా నువ్వు కూడా పరమపవిత్రుడవు అవుతావు, ఆయన సమక్షంలో ఉండటం వలననే నీకు తెలిసినా, తెలియకపోయినా నీకు కావలసిన శక్తి, జ్ఞానము, శాంతి నీకు అందుతూ ఉంటాయి. మీరు చేసే ప్రాణాయామాల కంటే, పూజలు జపాలకంటే గురువు పాదాల మీద భక్తి చాలు మనం ఉద్ధరింపబడటానికి, ఆ పాదాలే మనలను తీసుకొనిపోతాయి. మాకు ఆ తలంపులు వస్తున్నాయి, భయాలు వస్తున్నాయి ఆగోల నీకు ఏల? నీకు పునర్జన్మను తీసుకొని వచ్చే కోరికలు, నిన్ను బంధించే పెద్ద పెద్ద దుంగలలాంటి వాసనలు ఎన్నిఉన్నా అవిఅన్నీ కూడా గురువు సమక్షంలో ఉండటం వలన ఆయన దయ వలన రాలిపోతాయి. కొంతమంది భక్తులు రమణమహర్షికి దగ్గరగా ఉండేవారు. భగవాన్ నోటితో చెప్పనక్కరలేకుండానే ఆయనకు ఏమికావాలో ఆ భక్తులకు తెలిసేది. కొంతమంది ఆయన హృదయానికి అంత సన్నిహితంగా ఉండేవారు. వారు ఎవరైనా చనిపోయినట్లు వార్త వస్తే వారు వెళ్ళిపోయారు, నేను ఇంకా మిగిలాను అనేవారు. ఎచ్చమ్మాళ్ చనిపోయినప్పుడు కూడా ఆమె వెళ్ళిపోయిందా ఇంక నేను మిగిలాను అన్నారు. ఎచ్చమ్మాళ్ మీకు అన్నం పెట్టేది కదా నేను కూడా ఎచ్చమ్మాళ్ లాగ అన్నం పెడతాను అని ఒకరు అంటే అది ఆవిడ సొమ్ము మాత్రమే. మీరు అన్నం పెట్టవచ్చు కాని ఆ ఆప్యాయత, ఆ మధురస్వభావం, ఆ గురుభక్తి మీకు ఎలా వస్తాయి అన్నారు. జ్ఞాని

ప్రెజన్స్‌లో మీరు ఆయన అయిపోతారు, జ్ఞాని యొక్క వైభవం అటువంటిది.

నేను అది సాధించాను, నేను ఇది సాధించాను అనుకోవటానికి నువ్వు అంటూ ఒకడవు ఉన్నావా? నువ్వు తినేది ఈశ్వరుడిది, నువ్వు ఇతరులకు ఇస్తే అది ఈశ్వరుడిది, ఇతరులు ఇస్తే నీవు పుచ్చుకొనేది ఈశ్వరుడిది. నీకు సొంతం అంటూ ఈ సృష్టిలో ఏమీ లేదు అంతా ఈశ్వరుడిదే. ఈ విశాలమైన సృష్టిలో నీది అంటూ ఒక్క గడ్డిపరక కూడ లేదు. సత్యాన్ని దర్శించిన వాడు చెప్పిన మాట ప్రమాణం అంతేగాని దేహబుద్ధి ఉన్నవాడు చెప్పిన మాట ప్రమాణం ఎలా అవుతుంది. దేహాభిమానం ఉన్నవాడు ఏదైతే చెపితే చెప్పవచ్చు కాని అది శాస్త్రం అవుతుందా? ఇష్టం ఉన్నప్పడు ఒకలాగ, ఇష్టం లేనప్పడు ఒకలాగ మాటలు చెపితే అది శాస్త్రమా? నువ్వు ఇలా చేస్తే నీకు జ్ఞానం కలుగుతుంది అని శాసించేది శాస్త్రము. అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో నిలబడేది శాస్త్రం. నిజమైన గురువు నీ లోపలే ఉన్నాడు. ఆయన రూపరహితుడు, నామరహితుడు, కర్మరహితుడు, జన్మరహితుడు, వాడిని నీవు అర్థం చేసుకోలేవు. దేహాభిమానం ఉన్న నీవు దేహాభిమానం ఎలా ఉంటుందో తెలియనివాడిని ఎలా అర్థం చేసుకోగలవు, అది సాధ్యం కాదు. అందుచేత ఆయనకు అవసరం లేకపోయినా నీకోసం దేహం ధరించివస్తాడు, వాడు గురువు. వారు దేహంలో ఉన్నప్పడు కూడా ఆ దేహంతో నాకు సంబంధం లేదని వారికి తెలుసు. మనకోసం దేహం ధరించి మనతో కలిసితిరుగుతూ, సన్నిహితంగా ఉంటూ, అన్నం తిన్నావా, ఆరోగ్యం బాగా ఉందా, ఏదైనా సాధన చేసుకొంటున్నావా అంటూ మన స్థాయికి దిగివచ్చి మనకు తెలియకుండా మన మనస్సును హృదయగుహలోనికి గెంటేస్తాడు వాడు గురువు. గురువు శరీరం ఎక్కడ ఉన్నా ఇబ్బంది లేదు, ఆయనతో నీకు మానసికఅనుబంధం ముఖ్యం. కొంతమంది పెద్ద సాధన చేసినట్లు కనబడరు, మామూలుగా మనలాగే ఉంటారు, వారికి జ్ఞానం వచ్చేస్తుంది, గురుపాదాల మీద వారికి ఉన్న భక్తి వలన జ్ఞానం వచ్చేస్తుంది. మనం తరించటానికి గురువు యొక్క మాట చాలు, ఆయన చూపు చాలు, ఆయన పాదాలయందు భక్తి చాలు. తాబేలు నీటిలో ఈదుతూ ఉంటుంది, దాని గుడ్లు భూమి మీద పెడుతుంది. అది నీటిలో తిరుగుతూ ఉన్నా దాని మనస్సు అంతా భూమి మీద ఉన్న గుడ్లు మీద ఉంటుంది. అలాగే మీరు ఇంటిదగ్గర ఎన్ని పనులు చేసుకొంటున్నా మీ మనస్సు భగవంతుడి పాదాల మీద పెట్టండి అని రామకృష్ణుడు చెప్పారు. మీ మనస్సు భగవంతుని పాదాల మీదుంటే మీ మనస్సు బంగారం అవుతుంది, మీ మాట బంగారం అవుతుంది, మీ

ప్రవర్తన బంగారం అవుతుంది, మీ చేత బంగారం అవుతుంది, చివరకు మీరు బంగారం అవుతారు. అంటే పరమపవిత్రులవుతారు, అది శుద్ధ చైతన్యం. నీకు గురువుతో లోపల సంబంధం ఉన్నప్పుడు నువ్వు ఎక్కడ ఉన్నా, ఏ జన్మలో ఉన్నా ఏమీ ఇబ్బంది లేదు. గురువు సర్వజ్ఞుడు, అంతర్యామి. నీ మొఖాన్ని ఎప్పుడు, ఎలా మలుపు తిప్పాలో, నిన్ను ఎలా బాగుచేయాలో ఆయనే చూసుకొంటాడు.

సుఖం ఒక్క ఆత్మలో తప్పించి ఎక్కడా లేదు, ఎక్కడైనా ఉంది అనుకొంటే అది మీ అజ్ఞానానికి గుర్తు. మీకు ఏదైనా దుఃఖం వస్తూ ఉంటే, భయం వస్తూ ఉంటే, వేదన వస్తూ ఉంటే మీ లోపల ఉన్న అజ్ఞానం యొక్క ఫలితాలు ఇవి అన్నీ. గురువు యొక్క మౌనం చాలు మీరు బాగుపడటానికి, మౌనం అతిశక్తివంతమైనది. వారిని ఉద్ధరించాలి, వీరిని ఉద్ధరించాలి అని గురువు అనుకోడు, అది జరిగిపోతూ ఉంటుంది, అది ఆటోమేటిక్ డివైన్ యాక్షన్. గురువు యొక్క సన్నిధి చాలు, ఆయన శరీరం ధరించి ఉన్నా చాలు మాటతో పని లేదు. మీరు సాధనలు చేయండి, పూజలు, జపాలు, ధ్యానాలు, యాత్రలు చేయండి. మంచిదే కాని ఇవి అన్నీ చేయలేని వారికి గురువు యొక్క పాదాలు చాలు. పూజలు చేయాలంటే, యాత్రలు చేయాలంటే డబ్బు ఉండాలి, గురువు పాదాలయందు భక్తి కలిగి ఉండటానికి ధనంతో పనిలేదు. పూజలు, జపాలు, ధ్యానాలు చేయటం వలన ఏ ఫలితం వస్తుందో గురువు యొక్క పాదాలను ఆశ్రయించటం వలన అదే ఫలితం వస్తుంది. నారాయణుడికి నమస్కారం అంటే ఓ నారాయణా! నువ్వు ఉన్నావు నేను లేను అని అర్థం. మనం ఉన్నాము అనుకొంటున్నాము కాబట్టి దుఃఖం వస్తోంది, మనం లేము అని తెలిస్తే దుఃఖం ఎవరికి వస్తుంది. నేను శాంతిగా ఉంటే ఈ పంచభూతాలు శాంతిగా ఉన్నట్లు నాకు అనిపిస్తుంది, మీరందరూ నాకు స్నేహితులుగా కనిపిస్తారు, లోకం అంతా శాంతితో ఊగుతున్నట్లు అనిపిస్తుంది. అది అలా ఎందుకు జరిగింది, ఇది ఇలా ఎందుకు జరిగింది అని మనం అనుకొంటాము, కాని జ్ఞాని ఇదంతా భగవంతుడి యొక్క లీల అనుకొంటాడు. నువ్వు భగవంతుడి యొక్క శక్తిని అర్థం చేసుకోగలవా? భగవంతుడి యొక్క వైభవాన్ని అర్థం చేసుకోగలవా? నువ్వు ఈ భూమి మీదకు వచ్చినందుకు ప్రయత్నం చేసి, సాధన చేసి భగవదనుభవం పొంది బయటకు పోవాలి, ఈ శరీరానికి మరణం రాకముందే నువ్వు పొందవలసింది పొంది వెళ్ళిపో. మీరు భగవంతుడు చెప్పిన మాట వింటున్నారు అనుకోండి,

మీరు ఆయన దగ్గరకు వెళ్ళటం కాదు, ఆయనే మీ దగ్గరకు వచ్చి మిమ్మల్ని స్వాధీనం చేసుకొని ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు, వాడు దేవుడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 27-10-05, పాలకొల్లు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

కొంతమంది పెద్దలు ఈ భూమి మీదకు వస్తారు. అప్పటి సమాజపరిస్థితులను బట్టి చెపుతూ, సమాజంలో ఉన్న లోటుపాట్లను సవరించి, తాత్కాలికంగా ప్రయోజనాలు చేసి ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోతారు. కాని రామకృష్ణుడు, గౌతమబుద్ధుడు, రమణ మహర్షి వీరు కేవలం ఒక కాలానికి, ఒక దేశానికి పరిమితమైనటువంటి వారు కాదు. వారి నోటిద్వారా ఒకమాట వస్తే అది దేశానికి అతీతంగా, కాలానికి అతీతంగా ఉంటుంది. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, కొండలు ఎంతకాలం అయితే ఉంటాయో, నదులు ఎంత కాలం ప్రవహిస్తూ ఉంటాయో వారి మాట కూడా అంతకాలం ఉంటుంది అంతేగాని ఇవాళ కొత్తగా ఉండి, నాలుగు రోజులకు పాతబడిపోయే మాటలు కాదు. బ్రాహ్మీస్థితిని పొందిన వారు మాత్రమే అలా చెప్పగలరు లేకపోతే అలా చెప్పటం సాధ్యం కాదు. దేహం నేను అనుకొనే వాడికి సుఖం ఉంది, దుఃఖం ఉంది, బంధం ఉంది, మోక్షం ఉంది, దేహము నేను అనే వాడిని తీసి ఒకప్రక్కన పెడితే పుట్టుక లేదు, చావు లేదు, సుఖం లేదు, దుఃఖం లేదు, బంధం లేదు, మోక్షం లేదు. మనం ఏదైతే నేను, నేను అంటున్నామో ఆ నేను ఎవరు అని ప్రశ్నించుకొనే అలవాటు ఇంకా మనకు రాలేదు. కనిపించిన వారినల్లా మీరు ఎవరు అని అడుగుతాము, ఇతరుల గురించి వివరాలు సేకరిస్తాము కాని ఈ నేను ఎవరు అని ప్రశ్నించి, దీని గురించి సమాచారం తెలుసుకోవటం లేదు. ఇది మన అజ్ఞానానికి పరాకాష్ట. నేను సమాజాన్ని ఉద్ధరిస్తాను అంటావు మంచిదే. ఈ ఉద్ధరిస్తాను అనే నేను ఎవరు? మనం ఏదైతే నేను, నేను అంటున్నామో అది దేహగతమైనది, మనోగతమైనది, ఇంద్రియగతమైనది, ఇది సత్యం కాదు, దేహం ఎంత నిజమో, ఈ లోకం ఎంత నిజమో, పుణ్యపాపములు స్వర్గ నరకములు ఎంతనిజమో మనం అనుకొనే నేను కూడా అంతే నిజం. దేహం చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అని దేహం అనుకోదు, దేహానికి భిన్నంగా ఉన్న నేను అనుకొంటుంది. ఆ నేను ఎంత నిజమో ఈ దేహానికి వచ్చే చావు కూడా అంతే నిజం. ఈ నేనును ప్రశ్నించగా ప్రశ్నించగా అది ఎక్కడనుండి ఉదయించి వచ్చిందో అక్కడకు ఉపసంహరింపబడుతుంది.